ప్రజల వెన్నంటే ఉంటా!

- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- వైఎస్సార్‌ సీపీ నాయకులు, సానుభూతి పరులపై దాడులు, ఆస్తుల్ని ధ్వంసం చేయడం సరికాదు
- కుప్పం అభివృద్ధి సహకరిస్తాం
- ఎమ్మెల్సీ భరత్‌


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్‌

కుప్పం: ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుపోటములు సహజమని, తాను ఓటమి చవిచూసినా తనను ఆదరించిన ప్రజల వెన్నంటే ఉంటానని ఎమ్మెల్సీ భరత్‌ తెలిపారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. జరిగిన ఎన్నికల్లో ఫలితాలు తమ పార్టీకి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయన్నారు. ఏమైనప్పటికీ ప్రజాతీర్పును గౌరవిస్తామని, కుప్పం నియోజకవర్గంలో తమ కుటుంబం మూడుసార్లు ఎన్నికల్లో పోటీ చేసిందన్నారు. పదేళ్ల క్రితమే కుప్పం వచ్చి తన తండ్రి చంద్రమౌళి జనంతో మమేకమయ్యారని, ఆయన మరణానంతరం కుప్పంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ తన శాయశక్తులా ప్రజలకు సేవ చేస్తున్నట్టు చెప్పారు. తమనెంతో ఆదరిస్తున్న వారందరికీ ఎన్ని కష్టాలెదురైనా అండగా నిలబడతానన్నారు. పదేళ్లుగా కుప్పం నివసిస్తున్న తన కుటుంబం ఇక్కడి నుంచి వెళ్లిపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తన కోసం పనిచేసిన వారికి , ప్రేమాభిమానాలు చూపిన ప్రజలందరికి కోసం పనిచేస్తా. కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వం గొడవలను ప్రోత్సహించటం ఎంత మాత్రమూ మంచిది కాదని, అలాగే రాష్ట్రంలో, ఉమ్మడి జిల్లాల్లో వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దాడులు చేయడం, ఆస్తుల్ని ధ్వంసం ఎంతమాత్రమూ సరికాదని హితవు పలికారు. కుప్పంను మరింత అభివృద్ధి పథంలోకి ఎన్నికల్లో గెలిచిన చంద్రబాబు , ఇక్కడ ఉన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా వృక్షాల నరికివేత

- అక్రమ రవాణాతో జేబులు నింపుకుంటున్న వైనం
- కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేలోపు జోరుగా వృక్ష సంహారం


భారీ చెట్టును రంపాలతో కోస్తున్న దృశ్యం(ఫైల్‌)

పలమనేరు: మూడు నెలల నుంచి వివిధ శాఖల అధికారులు ఎన్నికల పనులు ముగించుకుని ఇప్పుడిప్పుడే విధుల్లోకి వస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై, సీఎం ప్రమాణ స్వీకారం, మంత్రివర్గం ఏర్పాటు కావాల్సి ఉంది. ఆ తర్వాత నూతన ప్రభుత్వం పరిపాలనకు పూనుకోవాల్సి ఉంది. అయితే ఈ వ్యవహారమంతా నడిచేందుకు కొన్నాళ్లు పడుతుంది. ఈ మధ్యలో కొన్నిరోజుల పాటు పరిపాలన ఒకరకంగా సుషుప్తావస్థలో ఉన్నట్టే లెక్క. ఇదే అవకాశంగా చేసుకుని కొందరు వృక్షాలను నరికి అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. వీటి దెబ్బకు పచ్చని భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. రైతుల భూముల్లోని వృక్షాలను సైతం కటింగ్‌ ఆర్డర్లు కూడా లేకుండా కొందరు నరికి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. నిబంధనల మేరకు వృక్షాలను నరకాలంటే వాల్టా చట్టం ప్రకారం అటవీశాఖ నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంది. అలాగే రైతుల పొలాల్లోని వృక్షాలను నరకాలంటే సంబంధిత వీఆర్వో, అటవీశాఖ అనుమతులు పొందాల్సి ఉంది. ఇవేవీ లేకుండా దర్జాగా వృక్ష సంహారం కొనసాగిస్తున్నారు. నిత్యం ఏదో ఒక గ్రామంలో వృక్షాలు నేలకొరుగుతూనే ఉన్నాయి. పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాల్లో వృక్షాల నరికివేత ఎక్కువగా ఉంటోంది.

క్లుప్తంగా

శనేశ్వరాలయాలలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో ఉన్న శనేశ్వరస్వామి

పుంగనూరు: శనేశ్వరస్వామి జయంతిని పురస్కరించుకుని ఆలయాలలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో రాగానిపల్లె రోడ్డులోని శనేశ్వరాలయం, యాభైరాళ్ల మొరవ వద్ద ఉన్న శనేశ్వరాలయాలలో వేకువజాము నుంచి స్వామివారికి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాలలో నువ్వుల దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దుర్గామాత ఆలయంలో..


ప్రత్యేక పూజల్లో భక్తులు

వి.కోట: అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలో దుర్గానగర్‌లోని శ్రీ దుర్గామాత ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ అర్చకులు భాస్కర్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం రకరకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. పూజాకార్యక్రమాలకు వందలాది భక్తులు, మహిళలు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతి మంగళ, శుక్రవారాలు, అమావాస్య రోజున అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మారెమ్మకు ప్రత్యేక అలంకారం



పుంగనూరు: అమావాస్య సందర్భంగా పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గుమ్మడికాయలు, నిమ్మకాయలతో పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చలమంగలంలో 'ఫ్యామిలీ డాక్టర్‌'


కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్‌ మురళి

పెద్దపంజాణి: మండలంలోని చలమంగలం గ్రామంలో పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మురళి గురువారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వైద్య నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు తెలియజేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వాజిదా ఫర్‌భాను, ఏఎన్‌ఎం నాగరత్న, ఆశా వర్కర్లు నాగమణి, రత్నమ్మ, తాజిదా తదితరులు పాల్గొన్నారు.

కంపు..కంపు


చికెన్‌ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం

సదుం: మండల కేంద్రంలోని పలు చికెన్‌ దుకాణాల నుంచి కొందరు వ్యర్థాలను సేకరిస్తున్నారు. వాటిని వాహనంలోని డ్రమ్ములలో వేసి చేపల పెంపకం కోసం తరలిస్తున్నారు. డ్రమ్ములపై ఎలాంటి మూతలు లేకపోవడంతో వాహనం వస్తే తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. ముక్కులు మూసుకున్నా భరించలేని పరిస్థితి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పలమనేరులో వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు పదిలం


పలమనేరులో ఓటింగ్‌కు బారులు తీరిన ఓటర్లు(ఫైల్‌)

- జిల్లాలోనే పలమనేరులో ఎక్కువ ఓట్లు వైఎస్సార్‌సీపీకి
- ఇక్కడ వైఎస్సార్‌సీపీకి 1,03,110 ఓట్లలో జిల్లాలో టాప్‌
- రెండో స్థానంలో నిలిచిన పుంగనూరులో ఓట్లు 1,00,793

పలమనేరు: సాధారణ ఎన్నికల టీడీపీ గెలిచినా పలమనేరులో వైఎస్సార్‌సీపీ తన ఓటు బ్యాంకును కాపాడుకున్నట్టు ఆ పార్టీకి లభించిన ఓట్లబట్టి స్పష్టమవుతోంది. చిత్తూరు జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా ఈ ఎన్నికల్లో పలమనేరు 2,67,896 ఓటర్లతో టాప్‌లో ఉంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు పోలైన ఓట్ల విషయంలోనూ పలమనేరు 1,03,110తో అగ్రస్థానంలో నిలిచి తన ఓటుబ్యాంకును కాపాడుకుంది. ఆ తర్వాతి స్థానంలో పుంగనూరు 1,00,793తో నిలిచింది. ఇదే పలమనేరులో గత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎన్‌ వెంకటేగౌడ 1,16,683 ఓట్లను సాధించారు. ఇదే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాజీమంత్రి అమరనాథ రెడ్డికి 85,738 ఓట్లు మాత్రమేదక్కాయి. ఈసారి టీడీపీ అభ్యర్థికి మొత్తం ఓట్లు బ్యాలెట్‌ కాకుండా 1,21,698 పడ్డాయి. అంటేగత ఎన్నికలకంటే ఈ పర్యాయం ఆయన 35,960 ఓట్లను అధికంగా సాధించారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ మాజీ మంత్రిపై సాధించిన మెజారిటీ 31,161 కావడం గమనార్హం. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా కారణంగా వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ దక్కిందని భావించొచ్చు. వైఎస్సార్‌సీపీ సాలిడ్‌ ఓటు బ్యాంకు లక్షకు పైగా ఓట్లను సాధించడం గొప్పవిషయమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అబాకస్‌ శిక్షణలో నలంద విద్యార్థులు ప్రతిభ


సాధించిన మెడల్స్‌, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వి.కోట: అబాకస్‌, వేదిక్‌ మ్యాథ్స్‌ లెవల్‌-1పై నలంద పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వేసవి సెలవుల సందర్భంగా స్థానిక పాఠశాలలో 45 రోజుల పాటు అబాకస్‌, వేదిక్‌ మ్యాథ్స్‌ లెవల్‌-1 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో నలంద పాఠశాల విద్యారులు ప్రతిభ కనబరచడంతో వారికి సర్టిఫికెట్స్‌, మెడల్స్‌ అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్‌ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అబాకస్‌ శిక్షణ కార్యక్రమం ద్వారా గణితంపై మంచి పట్టు సాధిస్తారని అందుకే తమ పాఠశాల విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



చిత్తూరు కార్పొరేషన్‌: గ్రంథాలయాల సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని పౌర గ్రంథాలయశాఖ రాష్ట్ర సంచాలకులు ప్రసన్నకుమార్‌ కోరారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం చిత్తూరు, బైరెడ్డిపల్లె, దామలచెరువు, పూతలపట్టు, జీడీనెల్లూరు, గ్రంథాలయాల్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు సలహాలు ఇచ్చారు. గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి శర్మ, లైబ్రేరియన్‌ మధుబాబు పాల్గొన్నారు.

వైభవంగా సల్లాపురెమ్మ పుష్పపల్లకి


పుష్పపల్లకిలో ఊరేగుతున్న సల్లాపురెమ్మ


అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలతో స్థానికులు

బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ సల్లాపురెమ్మ ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి పుష్పపల్లకి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్‌ దీపాలతో అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చారు. గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ గురువారం మధ్యాహ్నం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. పల్లకితో పాటు పూల గెరిగ మెరవణి భక్తులను ఆకట్టుకుంది. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నేతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


జీడీ నెల్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు

గంగాధర నెల్లూరు: బాల కార్మికుల చట్టం 1986 ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు దుకాణాల్లో పని చేయకూడదని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాధికారి ఆంజనేయులు శెట్టి, సీఐ మారుతి శంకర్‌ అన్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో వారు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల కార్మికులు దుకాణాలు, హోటళ్లలో పని చేయకూడదని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు. 14 ఏళ్లలోపు పిల్లలను వాణిజ్య సముదాయాల్లో, దుకాణాల్లో ఎవరైనా పనికి పెట్టుకుంటే ఆ యజమానులకు కఠిన శిక్ష విధిస్తామని తెలిపారు. అనంతరం జీడీ నెల్లూరు పోలీస్‌ స్టేషన్‌ నుంచి మండల కేంద్రం వీధుల్లో దుకాణ యజమానులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది మురళి, ఉమాదేవి, సబిత, పూర్ణచంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

నింద్ర: జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అగరం గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రెడ్డిరాము, నాగమణి మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అదేవిధంగా సజ్జ పంట సాగుపై తీసుకోవలసిన సూచనలు ఇచ్చారు. విత్తనశుద్ధి చేయడం వల్ల రైతులకు మేలు జరిగే అంశాలను వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణపై, సస్యరక్షణపై వివరించారు. అనంతరం రైతులకు సజ్జ విత్తనాలు, విత్తనశుద్ధి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏలు నాగపద్మని, సౌభాగ్యలక్ష్మి, ఏఓలు యామిని, పద్మజ, ప్రసన్న లక్ష్మి, తులసీరాం, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు


ధ్వజారోహణం

యాదమరి(బంగారుపాళ్యం): మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలకు ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం తమిళ నెల వయ్యాశిలో స్వామివారికి ఆగమ శాస్త్రం ప్రకారం 12 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేశారు.

తిరుమల తరహాలో స్వామివారికి వాహన సేవలు

ఇంద్ర వరదుని బ్రహ్మోత్సవాలు తిరుమల తరహాలో వాహన సేవలు నిర్వహిస్తారు. ప్రతి రోజు నిత్య కైంకర్యాలు, అభిషేకాలు పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. వాహన సేవలు సైతం తిరుమల తరహాలో పుర వీధులలో ఊరేగిస్తారు.

వాహనాల్లో ఊరేగనున్న స్వామివారు

స్వామివారు బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. 7వ తేదీన శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, 8న ఉదయం సప్రంలో ఉత్సవం, రాత్రి హంసవాహనం, 9న ఉదయం సప్రంలో ఉత్సవం, రాత్రి యాళీ వాహనం, 10న ఉదయం సూర్యప్రభ, రాత్రి శేష వాహనం, 11న ఉదయం గరుడవాహనం, రాత్రి కల్పవృక్ష వాహనం, 12న ఉదయం హనుమంతు వాహనం, రాత్రి కల్యాణం, ఏనుగు వాహనం, 13న మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి తోట ఉత్సవం, 14న రాత్రి అశ్వవాహనం, 15న తీర్థవారి, ధ్వజావరోహణం, 16న ద్వాదశి ఆరాధన, పుష్పపల్లకి సేవ, 17న రాత్రి వడాయితోత్సవాల్లో దేవతామూర్తులు పురవీధుల్లో ఊరేగనున్నారు.

ధర ఉన్నా.. దిగుబడి లేదు


పుత్తూరు మార్కెట్‌ యార్డ్‌కు చేరిన తోతాపురి


పుత్తూరు మార్కెట్‌ యార్డులో లారీలకు లోడ్‌ అవుతున్న మామిడి

- మామిడి రైతులకు తప్పని నష్టాలు
- ఈసారి దిగుబడి మరింత దారుణం
- జూన్‌లోనే ముగుస్తున్న మామిడి సీజన్‌
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు

- ఫ్యాక్టరీలో తోతాపురి టన్ను రూ.26 వేలు
- మండీల్లో తోతాపురి టన్ను రూ.33 వేలు
- బేనీషా రూ.45 వేలు, ఎక్స్‌పోర్ట్‌ క్వాలిటీ రూ.55 వేలు
- చందూర రూ.30 వేలు
- పుత్తూరు మార్కెట్‌ యార్డుకు చేరుతున్న మామిడి


చందూర రకం మామిడి

ఏటా మామిడి రైతు నష్టాలనే చవి చూస్తున్నాడు. ఓఏడు దిగుబడి బాగుంటే, గిట్టుబాటు ధరలేక నష్టపోవడం. ఈ ఏడు ధర ఆశాజనకంగా ఉంటే, దిగుబడి లేకపోవడం వంటి పరిస్థితులను మామిడి రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పుత్తూరు వ్యవసాయ డివిజన్‌ పరిధిలో 20 శాతం దిగుబడి మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పుత్తూరు: సకాలంలో పూత రాకపోవడం, ఆలస్యంగా వచ్చిన పూత రాలిపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడానికి కారణంగా రైతులు చెబుతున్నారు. పగలు అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి మంచు కురవడం వంటి వాతావరణంలో ఊహించని మార్పుల వల్ల పంట దెబ్బతినిందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనప్పటికీ ఈసారి తోటల సస్యరక్షణ పేరిట పెట్టిన ఖర్చులు సైతం చేతికి అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పుత్తూరు వ్యవసాయ డివిజన్‌ పరిధిలో 15 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. డివిజన్‌ పరిధిలో పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం, నారాయణవనం మండలాలు ఉండగా అధిక శాతం తోటలు వడమాలపేటలో ఉన్నాయి. ఈ ఒక్క మండలంలోనే ఐదు వేల ఎకరాలు ఉండగా, ఇందులో తోతాపురి రకం అగ్రభాగాన ఉన్నాయి. సాధారణంగా మంచి దిగుబడి వస్తే డివిజన్‌ మొత్తం మీద 45 నుంచి 50 వేల టన్నుల దిగుబడి వస్తుంది. అయితే ఈఏడు పూత సకాలంలో రాకపోవడంతో పాటు ఆలస్యంగా వచ్చిన పూత సైతం రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు కనీసం మూడు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా నేడు అరటన్ను కూడా చేతి కందేటట్లు లేదు. దీంతో డివిజన్‌ మొత్తం మీద దిగుబడి 10 వేల టన్నులకు లోపే పడిపోయినట్లు అంచనా. టేబుల్‌ వెరైటీగా పిలవబడే బేనీషా దిగుబడే లేక అన్నదాతలు అల్లాడిపోయారు. ఒకటీ, అరా మామిడి చెట్లలో కనబడే కాయలను బంధు, మిత్ర వర్గాలకు పంచేందుకే సరిపోయిందని రైతులు వాపోతున్నారు. అదీగాక జూన్‌ నెల ప్రారంభం నుంచి మొదలైన నైరుతి రుతుపవనాల కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షం అడప దడపా పడుతుండడంతో ఉన్న కాయలు కూడా నేలరాలుతున్నాయి. దీంతో అన్నదాతల కంట కన్నీరు సుడులు తిరుగుతున్నాయి. జూలై 15 వరకు మామిడి సీజన్‌ కొనసాగాల్సి ఉండగా ఈసారి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మరో పది రోజుల్లో మామిడి సీజన్‌ పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వ్యాపారుల సిండికేట్‌



మామిడి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మార్కెట్‌ యార్డుల్లోని వ్యాపారులతో పాటు జ్యూస్‌ కంపెనీల వారు సైతం సిండికేట్‌ అయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. వాతావరణం సహకరించక, వ్యాపారులు సహకరించకా రైతులు ఎలా బతకాలి. వ్యవసాయం జూదంలా తయారైంది. ప్రభుత్వాలు రైతుకు అండగా నిలబడకపోతే తినడానికి భవిషత్‌లో ఏమీ ఉండదు.

–టి.కేశవులు, అధ్యక్షుడు, కేబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ, పుత్తూరు

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాకు ఐదు ఎకరాల మామిడి తోట ఉంది. ఎకరాకి రూ.25 వేలు వంతున రూ.1.25 లక్షలు ఖర్చు పెట్టాను. అయితే దిగుబడి ఏమాత్రం ఆశించన స్థాయిలో రాలేదు. ఇలా ఏటా నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. రాయితీతో మందులు పంపిణీ చేయాలి. తోటల్లోకి శాస్త్రవేత్తలను పంపి తగిన సూచనలు ఇప్పించాలి.

– దొరైనాయుడు, రైతు, శివగిరి, పిచ్చాటూరు మండలం

పెట్టుబడి సైతం వచ్చేలా లేదు



ఈ ఏడు మామిడి దిగుబడి కేవలం 10 నుంచి 20 శాతానికి మించి లేదు. తోటల సస్యరక్షణకై పెట్టిన పెట్టుబడి సైతం చేతికందే పరిస్థితి కనబడడం లేదు. వాతావరణ మార్పుల కారణంగా ఈసారి నష్టపోయాం. ఏటా మామిడి రైతు ఏదోరకంగా నష్టపోతూనే ఉన్నాడు. దీనికి తోడు మార్కెట్‌ యార్డుల్లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మా తలరాతలు మాత్రం మారడం లేదు.

– ఎస్‌.చెంగయ్య, రైతు, కేబీఆర్‌ పురం, పుత్తూరు మండలం